సాక్షి
పల్నాడు
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025




వరసిద్ధి వినాయకుడికి హోమాలు

వినుకొండ: కొండమెట్ల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. 40 మంది దంపతులచే నవగ్రహ, లక్ష్మీ, గణపతి హోమాలు చేశారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,550 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 17 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 587 అడుగులకు చేరింది. జలాశయం నుంచి 53,210 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

బార్‌లకు రీ నోటిఫికేషన్

- నేటి నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 15న లాటరీ ద్వారా ఎంపిక



నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో మిగిలిన 30 బార్ అండ్ రెస్టారెంట్‌లకు తిరిగి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.మణికంఠ గురువారం తెలిపారు. జిల్లాలో 54 బార్ అండ్ రెస్టారెంట్‌లకుగాను మొదటి విడత 24 బార్‌లకు పూర్తిస్థాయిలో దరఖాస్తులు రాగా, లాటరీ పద్ధతిలో కేటాయింపులు జరిగాయన్నారు. మిగిలిన 30 బార్‌లకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రీనోటిఫికేషన్ గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. నరసరావుపేటలో 8, చిలకలూరిపేటలో 7, పిడుగురాళ్లలో 6, మాచర్ల 3, వినుకొండలో 6 నూతన బార్ అండ్ రెస్టారెంట్‌లకు శుక్రవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 15వ తేదీ జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామని తెలిపారు.


యూరియా సమస్యలపై కంట్రోల్ రూం ఏర్పాటు

నరసరావుపేట: జిల్లాలో యూరియా సరఫరా మెరుగుపర్చేందుకు వ్యవసాయశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గురువారం పేర్కొన్నారు. యూరియా సరఫరాలో సమస్యలు, అక్రమాలను 83320 66633 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

7న కోటప్పకొండ ఆలయం మూసివేత


నరసరావుపేట రూరల్: చంద్రగహణాన్ని పురస్కరించుకుని ఈనెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 8వ తేదీ ఉదయం ఏడు గంటల వరకు కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయాన్ని మూసి వేస్తున్నట్టు ఆలయ ఈవో టి.చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం 8 గంటల నుంచి స్వామి వారి దర్శనాన్ని భక్తులకు కల్పిస్తామని తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు దర్శన వేళల్లో మార్పులను గమనించాలని కోరారు.

పశ్చిమ డెల్టాకు 7,427 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం 7,427 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు 296, బ్యాంక్ కెనాల్ 1,848, తూర్పు కాలువకు 699, పశ్చిమ కాలువకు 267, నిజాంపట్నం కాలువకు 500, కొమ్మూరు కాలువకు 3,080 క్యూసెక్కులు విడుదల చేశారు. సముద్రంలోకి 18,125 క్యూసెక్కులు వదులుతున్నారు.

గోతాల్లో జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : పేదలందరికీ ఇళ్లు ఉండాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి నిలువ నీడ కల్పించారు. స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్లు నిర్మించే కార్యక్రమం కూడా చేపట్టారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 75 వేల మందికి స్థలాలు కేటాయించారు. ఇందులో కొంత మందికి ఇళ్ల పట్టాలు కూడా పంపిణీ చేశారు.అయితే, వాటిని పూర్తి స్థాయిలో అధికారులు పంపిణీ చేయకపోవడంతో సచివాలయాల్లోనే మూలుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. నగర పరిధిలోని 127వ వార్డు సచివాలయంలో బుధవారం పాత సీఎం జగన్మోహన్‌రెడ్డి పేరుతో సదరం సర్టిఫికెట్ జారీ చేయడంపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, సచివాలయ సెక్రటరీలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో సచివాలయాల్లో ఉన్న పాత సర్టిఫికెట్స్, డాక్యుమెంట్స్‌ను నగరపాలక సంస్థకు అందజేయాలని ఆదేశించడంతో గోతాల్లో వేల సంఖ్యలో రిజిస్టర్ ఇళ్ల పట్టాల డాక్యుమెంట్స్ దర్శనమియ్యాయి.

అవార్డుల్లోనూ అతివలదే పైచేయి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పల్నాడు జిల్లా పరిధిలో మహిళామణులకే దక్కాయి. పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన రాష్ట్రస్థాయి అవార్డుల జాబితాలో పల్నాడు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయినిలు ఎంపికయ్యారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.పార్వతి, నకరికల్లు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయిని బి.శివకుమారి, నాదెండ్ల మండలం కనపర్రు ఎంపీపీ పాఠశాల ఎస్‌జీటీ వై.రాజ్యలక్ష్మి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. వీరు అవార్డుల కోసం దరఖాస్తు చేయకున్నా ప్రభుత్వం గుర్తించి ఎంపిక చేయడం గమనార్హం.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక

ప్రత్యేక శిక్షణలో మేటి రాజ్యలక్ష్మి



నరసరావుపేట రూరల్ పరిధిలోని శ్రీనివాస గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 1998లో ఉపాధ్యాయినిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన వై.రాజ్యలక్ష్మి 2009 వరకు సత్తెనపల్లిలో పనిచేశారు. అక్కడ నుంచి 2017లో నాదెండ్ల మండలం కనపర్రు ఎంపీపీ పాఠశాలకు వచ్చారు. అప్పటి నుంచి అదే పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాను బాధ్యతలు స్వీకరించే నాటికి ఇద్దరు ఉపాధ్యాయులు, 23 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 67 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులతో కళకళలాడుతున్నది. రాజ్యలక్ష్మి బీకాం, బీఈడీ చేసిన ఆమె దానితో సరిపెట్టుకోకుండా తెలుగు, ఇంగ్లీష్, చరిత్రతోపాటు యోగాలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. విద్యార్థులకు తరగతి గది బోధనతోపాటు ఆట పాటలు, యోగా, బోధనా ఉపకరణాల ద్వారా ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వటం విశేషం.

క్రమశిక్షణకు మారుపేరు పార్వతి



డీఎస్సీ-2000 ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై వినుకొండ మండలం నడిగడ్డ పాఠశాలలో టీచర్‌గా ఎం.పార్వతి జీవితాన్ని ప్రారంభించారు. 2006లో పొన్నూరు మండలం నండూరు పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి 2013లో ఉద్యోగన్నతిపై రేపల్లె మండలం నల్లూరుపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో కాకుమాను మండలం బోడిపాలెంలో పనిచేసి 2023లో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు. క్రమశిక్షణ గల ఉపాధ్యాయినిగా, ప్రధానోపాధ్యాయినిగా పాఠశాలను ఏకతాటిపై నడుపుతూ విద్యార్థుల నుంచి ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారు. గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాలలో 590 మార్కులతో నియోజకవర్గంలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిపారు. తాను వ్యక్తిగతంగా అవార్డుకు దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు.

తెలుగు భాషపై శివకుమారికి పట్టు



డీఎస్సీ-1996 ద్వారా తెలుగు ఉపాధ్యాయినిగా ఎంపికైన బి.శివకుమారి కనపర్రు పాఠశాలలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. కేసానుపల్లి, కండ్లకుంట, తుమ్మలచెరువు, రెడ్డిపాలెం తదితర పాఠశాలల్లో పనిచేసి 2023లో జరిగిన బదిలీలలో నకరికల్లు జెడ్పీ హైస్కూల్‌కు వచ్చారు. తెలుగు భాషపై పట్టు, ఆధ్యాత్మిక ప్రసంగాలలో దిట్టగా గుర్తింపు పొందిన శివపార్వతి ఎన్నో ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు. క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరై విద్యార్థులకు ప్రత్యేక బోధనా పరికరాల ద్వారా బోధన అందిస్తుంటారు. ప్రత్యేకించి పాఠశాలలోని గ్రంథాలయాన్ని తాను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగించటం తన పాఠశాల దినచర్యలో ఒక భాగంగా మార్చుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయినిగా తాను దరఖాస్తు చేయలేదని రాష్ట్ర పాఠశాల విద్య కార్యాలయం తనను ఎంపిక చేసినట్టు తెలిపారు.

సమాజ శిల్పులు ఉపాధ్యాయులు

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లాలో 104 మందికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



సత్తెనపల్లి : సమాజ శిల్పులు ఉపాధ్యాయులు. వీరికి స్ఫూర్తిగా నిలిచే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. ఇందులో భాగంగానే శుక్రవారం పల్నాడు జిల్లా వ్యాప్తంగా గురుపూజోత్సవం నిర్వహించుకునేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతుంది. పల్నాడుకు సంబంధించి నరసరావుపేట భువన చంద్ర టౌన్ హాలులో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం తరఫున శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. దీని కోసం జిల్లా యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 104 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యా యుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

గుర్తింపు సంతోషకరం



నేను 1998 నుంచి ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నా. నా వంతుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశా. ప్రస్తుతం సత్తెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుగాలీ కాలనీలో ఎస్ఏ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. గతంలో రెండు సార్లు ఉగాది పురస్కారాలు అందుకున్నా.

–డాక్టర్ ఎస్‌వీ రాంబాబు, తెలుగు జెడ్పీహెచ్ఎస్, సత్తెనపల్లి

సులభతర బోధన



నేను 2005 నవంబర్ 14న ఉపాధ్యాయ వృత్తిలో చేరా. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నాం. విద్యార్థి పరిస్థితిని అర్థం చేసుకొని మెలకువలు వివరిస్తున్నా. విద్యార్థులకు విద్య పట్ల మక్కువ పెంచుతున్నా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వరించడం ఆనందంగా ఉంది.

–పీఎం రమేష్ బాబు, ఎస్జీటీ ఎంపీపీఎస్, బృగుబండ(హెచ్‌ఈ)

చాలా సంతోషంగా ఉంది



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. పేదల విద్యాభివృద్ధి లక్ష్యం. విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ బోధన చేస్తున్నా. తల్లిదండ్రులకు చదువుతో ఉన్న ప్రయోజనాలు వివరించి పిల్లలను బడికి పంపేలా తన వంతు కృషి చేస్తున్నా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది.

–మేరీ కమల, ఎస్జీటీ ఎంపీపీఎస్, భాగ్యనగర్ కాలనీ, ధూళిపాళ్ల

టెండరు ప్రక్రియలో టీడీపీ నేత దౌర్జన్యం

జిల్లా పరిషత్ ఆదాయానికి రూ.లక్షల్లో నష్టం

నాదెండ్ల: టెండరు ప్రక్రియలో ఓ టీడీపీ నేత దౌర్జన్యం చేయటంతో జిల్లాపరిషత్ ఖజానాకు జమ కావాల్సిన ఆదాయానికి గండి పడింది. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో జిల్లా పరిషత్‌కు సంబంధించి 528/సి/ఏ1 సర్వే నెంబరులో 30 సెంట్ల విస్తీర్ణం గల స్థలం, అందులోని దుకాణాలకు గురువారం షార్ట్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించారు. జిల్లా పరిషత్ అధికారులు టెండరు విలువ ఏడాదికి రూ.1.50 వేలు చొప్పున మూడేళ్ళ కాల పరిమితికి టెండర్లు పిలిచారు. ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సైదారావు ఆధ్వర్యంలో షార్ట్ టెండరు జరగ్గా, బయట వ్యక్తులు టెండరులో పాల్గొనకుండా గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత అడ్డుకున్నాడు. అక్రమంగా కేసులు పెట్టిస్తామని బెదిరింపులకు దిగటంతో టెండరులో పాల్గొనేందుకు వచ్చిన పలువురు భయపడి వెనుదిరిగారు. గతంలో టెండరు దక్కించుకున్న కోలా విజయలక్ష్మీ, మరో ఇరువురు వ్యక్తులు టెండర్లు వేశారు. హెచ్చు టెండరుదారుగా కోలా విజయలక్ష్మీ ఏడాదికి రూ.1.60 లక్షలకు టెండరు వేశారు. అయితే మిగిలిన ఇరువురూ బహిరంగ వేలం నిర్వహించాలని అధికారులను కోరటంతో వేలం నిర్వహించారు. కోలా విజయలక్ష్మి రూ.1.75 లక్షలకు వేలం పాడి హెచ్చు పాటదారుగా నిలిచారు. దీంతో ఆమెకే టెండరు ఖరారు చేశారు. టెండరు ప్రక్రియలో ఇతరులు పాల్గొనేందుకు అవకాశం కల్పించి ఉంటే జిల్లాపరిషత్‌కు మరింత ఆదాయం సమకూరి ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. టీడీపీ నేతల దౌర్జన్యంతోనే ఖజానాకు చేరాల్సిన ఆదాయానికి గండి పడిందని స్థానికులు విమర్శిస్తున్నారు.



బాక్సులో టెండరు ఫారం దాఖలు చేస్తున్న కోలా విజయలక్ష్మి

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- మాజీ ఎమ్మెల్యే కాసుపై నమోదు చేసిన అక్రమ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలి
- వినాయక విగ్రహం ఊరేగింపులో కుంకుమ పడిందని ఎనిమిది మందిపై కేసు పెడతారా
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆగ్రహం



నరసరావుపేట: గురజాల మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డిపై పోలీసులు పెట్టిన అక్రమ కేసును వెంటనే తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులు తీవ్ర స్థాయికి చేరాయని, ఇది సమాజానికి మంచిది కాదని అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వారిని ఉద్దేశించి ఈ రోజు మీరు కర్రలతో మా మీద దాడులు చేస్తున్నారు, రేపు మా వాళ్ల గొడ్డళ్లతో వస్తారని ఆ పార్టీ దౌర్జన్యాలను నియంత్రించే ఉద్దేశంతో కాసు అన్నారని చెప్పారు. అంతమాత్రానికే అతనిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడితే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను నా కొడకల్లారా అని మాట్లాడిన పవన్ కల్యాణ్‌పై, మంత్రి నారా లోకేష్ కూడా అనేక సందర్భాల్లో బండ బూతులు మాట్లాడారని వారిపై ఎందుకు కేసులు నమోదు కాలేదని ప్రశ్నించారు.
- పోలీసులకు ప్రమోషన్లు రావడం లేదని రాసిన సాక్షి ఎడిటర్‌పై అక్రమంగా కేసు పెట్టారని, ఇది దారుణమైన విషయం అన్నారు.
- రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా టీడీపీకి చెందిన ఒక వ్యక్తిపై కుంకుమ పడితే, ఆ వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించారన్నారు. ఇంతకంటే దారుణమైన విషయం ఇంకా ఏమైనా ఉందా అని జిల్లా ఎస్పీ ఆలోచన చేయాలన్నారు.
- ఆ కేసు పెట్టిన వ్యక్తి రెండు అడుగులు రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేశాడన్నారు. కుంకుమ పడినందుకు కేసులు బుక్ చేస్తున్న రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళ్తుందో అర్థం కావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- ఇటీవల తమ పార్టీకి చెందిన వరవకట్ట బుజ్జి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని 16 మందిపై కేసు బుక్ చేశారన్నారు.
- నిన్న టీడీపీ మాజీ కౌన్సిలర్ మోర్ సెంటర్‌లో నడిరోడ్డు మీద కేక్ కట్‌చేసినా అనిపై కేసు ఎందుకు బుక్ చేయలేదని పోలీసులను ప్రశ్నించారు.
- యూరియా దొరకట్లేదని మాట్లాడితే కేసులు పెట్టమని పోలీసు అధికారులు చెప్పటం దారుణమైన విషయం అన్నారు.
- ఇప్పటి వరకు కాసుపై గురజాల నియోజకవర్గానికి సంబంధించి నాలుగు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారని, ఇంకా ఎన్ని స్టేషన్లలో కేసులు నమోదు చేశారో తెలియట్లేదని, తక్షణమే సుమోటోగా ఆ అక్రమ కేసులను విత్‌డ్రా చేసుకోవాలని పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

అంతుచిక్కని వ్యాధి.. బతుకులు సమాధి

- భయం గుప్పెట్లో తురకపాలెం
- బయటకు రావాలంటే భయపడుతున్న గ్రామస్తులు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన
- చుట్టాలు కూడా రావడం లేదని ఆవేదనం
- ఇతర గ్రామాల్లో పనులకు వెళ్లాలన్నా రానివ్వడం లేదు
- హడావుడిగా కదిలిన యంత్రాంగం
- వైద్య శిబిరానికి రావాలన్నా భయపడుతున్న ప్రజలు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామస్తులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రతి వీధిలో నలుగురైదుగురు మృత్యువాతకు గురవ్వడంతో చిన్నపాటి అనారోగ్యం కలిగినా భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరిస్తున్నారే గానీ కారణాలు చెప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. తమను పక్క గ్రామాల వారు పనులకు పిలవడం లేదని, జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు

గ్రామంలో అధికారులు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు రావాలంటే భయపడుతున్నారు. పరీక్షలు చేసిన తరువాత ఏ రోగం బయటపడుతుందో.. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాం కదా! అని కొందరు మిన్నకుండిపోతున్నారు. మరికొందరైతే ప్రభుత్వ వైద్యులను నమ్మలేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి పెద్ద మొత్తంలో ఖర్చుచేసి చికిత్సలు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా చేసుకుని ప్రైవేటు వైద్యులు అందిన కాడికి బిల్లులు కట్టించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తురకపాలెం అని పేషెంట్ చెబితే చాలు రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.



తురకపాలెంలో పర్యటిస్తున్న అంబటి రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సుధీర్ భార్గవరెడ్డి



ఇంటికి అడ్డంగా తెరలు కట్టుకున్న గ్రామస్తులు

హడావుడిగా పర్యటనలు

గ్రామంలో మీడియా తిరుగుతుందని తెలిసి అధికారులు హడావుడిగా పర్యటనలు చేశారు. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకూ నాలుగు నెలలుగా ఇంత జరుగుతున్నా పట్టించుకోలేదని, ఇప్పుడు హడావుడి పర్యటనలు చేస్తున్నారంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది హడావుడిగా మురుగు కాల్వలు శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లుతున్నారు.

వదంతులతో వణుకు

ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంతో వణికి పోతున్నారు. అదేదో వైరస్.. బ్యాక్టీరియా అంట.. నీటి ద్వారా, మట్టి ద్వారా వస్తుందంట.. అది రావడంతోనే ఇన్‌ఫెక్షన్‌లకు గురై మృత్యువాతకు గురవుతున్నారని గ్రామస్తులు చర్చించుకుంటు న్నారు. రాత్రి 8 గంటల తరువాత ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని వాపోతున్నారు.

రచ్చబండ పేరుతో ఎమ్మెల్యే హడావుడి

గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే రచ్చబండ పేరుతో ప్రధాన వీధి చెట్టుకింద కూర్చుని ప్రజలతో ముచ్చటించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని పలువురు అడిగారు. ప్రతి ఇంటికీ రూ. వెయ్యి చొప్పున కలెక్ట్ చేయించండని, దానికి తోడు మరికొంత తాను ఇస్తానని, దాన్ని బాధిత కుటుంబాలకు ఇద్దామని ఎమ్మెల్యే అన్నాడని ప్రజలు వాపోతున్నారు. ఒక పక్క అనారోగాలతో మృత్యువాతకు గురవుతున్న ప్రజలు ఇంటికి వెయ్యి రూపాయలు ఎలా ఇస్తారని మహిళలు, ప్రజలు చర్చించుకుటున్నారు. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రజాప్రతినిధి ఈ విధంగా మాట్లాడటంపై కొందరు పెదవి విరుస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి: ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు రూరల్: తురకపాలెంలో స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గురువారం పర్యటించారు. గత నాలుగు నెలలుగా గ్రామంలో ప్రజలు అకాల అనారోగ్య మృత్యువాతలకు గురవ్వడంతో గురువారం గ్రామంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యశాఖ, తాగునీటి శాఖ అధికారులతో మాట్లాడారు. గ్రామంలో పరిస్థితులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సరిపోకపోతే ఇతర గ్రామాలనుంచి తెచ్చుకుని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను వాకబు చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఇంటింటికీ రక్త నమూనాల సేకరణ

జరగాల్సిన నష్టం జరిగిన తర్వాత తీరిగ్గా ప్రజారోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల నుంచి రక్తం, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. తాగునీటి, మట్టి పరీక్షలు చేస్తున్నారు. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా ? అని పారిశుద్ధ్యం కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

సరిహద్దురాయి సరిచేసిన పెద్దలు

నాలుగు నెలల కిందట గ్రామంలో ఏర్పాటు చేసిన పొలిమేర రాయి ఒక పక్కకు ఒరగడంతో అనర్థాలు జరుగుతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలోని పెద్దలు శాస్త్రోక్తంగా సరిహద్దు రాయిని సరిచేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 18,00 గరిష్టం : రూ. 2,600

మోడల్ ధర రూ. 2,300

పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 647

కొమ్ములు : 551బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
10,300	10,450	10,320

కాయలు : 241 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,300	10,450	10,350

మొత్తం అమ్మకాలు : 485.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	75,968
అమ్మకాలు	70,144
నిల్వ	15,795

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,300
నంబరు-5	10,000-13,500
341	11,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,500
నంబరు-5	10,000-13,500
341	11,000-15,500
4884	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,400
బాడిగ 355	10,000 - 15,000
దేవనూరు డీలక్స్	10,000 - 13600
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,300
బాడిగ 355	10,000 - 14,800
దువనూర్ డీలక్స్	10,500 - 13,500
తాలు	5,500 - 7,500

–కొరిటెపాడు (గుంటూరు)

WANTED
మా సంస్థ నిర్వహించే తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షలలో విద్యార్థులు పాల్గొనేలా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేయించగల అభ్యర్థులు అవసరం.
Salary: 15,000/- +T.A, D.A
మన సంస్కృతి
Cell: 73960 49947

యడవల్లి దళితులకు న్యాయం చేయాలి

- కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్
- జాయింట్ కలెక్టర్‌కు వినతి


కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన నాయకులు, దళిత రైతులు

నరసరావుపేట: చిలకలూరిపేట మండలం యడవల్లి దళిత రైతుల నుంచి ప్రభుత్వం కారుచౌకగా తీసుకున్న విలువైన భూములపై హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి న్యాయమైన పరిహారం ఇవ్వాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసి హైకోర్టు ఉత్తర్వు కాపీలను అందజేసి కోర్టు ఆదేశాల మేరకు యడవల్లి దళిత రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించాలని కోరారు. రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులు కలెక్టర్‌కు పెట్టుకున్న అర్జీపై మూడు వారాలలోగా సమాధానం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. యడవల్లి గ్రామంలో 1975లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నాటి జిల్లా కలెక్టర్ చంద్రయ్య భూమిలేని 120 దళిత, గిరిజన కుటుంబాలకు 416 ఎకరాలు బీడు భూమిని అసైన్డ్ చేసి వీకర్స్ కాలనైజేషన్ సొసైటీ పేరిట రిజిస్టర్‌చేసి పంపిణీ చేశారన్నారు. వాటిని 50 ఏళ్ల నుంచి లిఫ్ట్ ద్వారా ఏడాదికి వరి, ఆరుతడి రెండు పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. భూములలో గ్రానైట్ నిక్షేపాల నెపంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. దళిత రైతులను బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి ఎకరాకు రూ.8.33లక్షల పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకుందన్నారు. భూమి స్వాధీనం చేసుకునే క్రమంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా బలవంతపు భూ సేకరణ జరిపారన్నారు. అప్పటి 120 మంది లబ్ధిదారులకుగాను ప్రస్తుతం వారి వారసులు 244 మందిగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. నాటి నుంచి నేటివరకు పేద రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో చట్టప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారన్నారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో దీనిపై వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎకరాకు రూ.40లక్షల పరిహారం ఇవ్వాలని పిటీషనర్ల తరుపు న్యాయవాది వి.రవీందర్ కోర్టులో వాదనలు వినిపించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.వెంకటస్వామి, పెద్దిరాజు, యడవల్లి రైతులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఏడీగా పూసల శ్రీనివాసరావు


శ్రీనివాసరావును అభినందిస్తున్న ఏపీ ఎన్జీవో సంఘం, జీజీహెచ్ ఉద్యోగ సంఘాల నేతలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా (ఏడీ) పూసల శ్రీనివాసరావు గురువారం విధుల్లో చేరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ ఏడీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు జీజీహెచ్ ఏడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గుంటూరు జీజీహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, పరిపాలనా అధికారిగా, ఇన్‌చార్జి ఏడీగా శ్రీనివాసరావు పని చేశారు. 2024లో ఏడీగా పదోన్నతి పొంది, కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం జీజీహెచ్ ఏడీగా పనిచేస్తున్న చింతలపూడి నాగేశ్వరరావు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన ఏడీని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యామ్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది బొకేలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో పెండింగ్‌లో ఉన్న రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులను మూడు నెలల్లో ఇస్తామని తెలిపారు. మందులు, సర్జికల్స్, ఇంప్లాంట్ల టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, ఆసుపత్రిలో రోగులకు అన్నీ అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, జాయింట్ డైరెక్టర్ సుధారాణి సహకారంతో పరిపాలన విభాగంలో మార్పులు తీసుకొచ్చి, మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

పంటలపై పరిశోధన, విస్తరణ దిశగా రోడ్ మ్యాప్


వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు

గుంటూరు రూరల్: లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన జాతీయ నూనె గింజల సంస్థ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రంలో వ్యవసాయ ప్రాముఖ్య అంశాల గుర్తింపుపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ జాతీయ పరిశోధన సంస్థల ప్రతినిధులు, రాష్ట్రస్థాయి పరిశోధన సంస్థలు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. వర్క్‌షాప్ నోడల్ ఆఫీసర్ ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె మధుర్ మాట్లాడుతూ వివిధ పంటల్లో ముఖ్యమైన పరిశోధన, విస్తరణ, అంశాలను గుర్తించి వాటిని సాధించేందుకు అవసరమైన ప్రణాళికల కోసం రోడ్ మ్యాప్ రూపొందించాల్సి ఉందన్నారు. ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయ లక్ష్మీదేవి , ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ కె సురేష్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ మధుమతి, డాక్టర్ పీవి సత్యనారాయణ, డాక్టర్ ఎ.లత పాల్గొన్నారు.

యూరియా అక్రమ తరలింపు కేసులో ఇద్దరికి రిమాండ్

–జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: యూరియా అక్రమాలపై జిల్లా అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం వెల్లడించారు. పొందుగల చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా యూరియాను తెలంగాణకు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, వారికి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. ఈ నెల 2వ తేదీన పొందుగల చెక్‌పోస్టు వద్ద మండల స్థాయి బృందం ఆకస్మిక తనిఖీలో 630 కేజీల యూరియాను తెలంగాణకు అక్రమంగా తరలిస్తూ నల్గొండ జిల్లా వాసులు పులి పిచ్చయ్య, బుక్యా రవి పట్టుబడ్డారన్నారు. ఎరువుల రవాణాకు వినియోగించిన వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. వ్యక్తిగత వాహనాలను ఇతరులు ఎరువుల రవాణాకు వినియోగించకుండా జాగ్రత్త పడాలని పౌరులకు సూచించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

చినగంజాం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా చినగంజాం మండలానికి చెందిన ఇరువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రావిపాటి శివ వెంకట పోతురాజు, ఆవులదొడ్డి గొల్లపాలెంలోని పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కదలి సుజాతలు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.


భిక్షాటనకు వచ్చి నగదు చోరీ

కోడూరు: స్వామిజీల వేషధారణలో భిక్షాటనకు వచ్చిన నలుగురు వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వారిని కోడూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ చాణక్య కథనం మేరకు.. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన బచ్చు వెంకట పున్నయ్య ఇంటికి నలుగురు వ్యక్తులు గురువారం స్వామిజీల వేషధారణ భిక్షాటనకు వచ్చారు. పున్నయ్య వరండాలో టేబుల్‌పై రూ.11 వేలు ఉంచి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో భిక్షాటనకు వచ్చిన నలుగురు దొంగ స్వాములు ఆ నగదును దొంగిలించి పరారయ్యారు. నగదు పోయిన విషయాన్ని గ్రహించిన పున్నయ్య వెంటనే కోడూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా బాపట్ల జిల్లా నగరం గ్రామానికి చెందిన గంధం శివయ్య, గంధం తోట స్వామిజీ, పాసం బాజీ, పాసం యేసును నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

రేపల్లె: రేపల్లె ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియమకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, జంతుశాస్త్రం, కంప్యూటరు సైన్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉన్న వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకి హాజరు కావాలన్నారు.

కరెంట్ షాక్‌తో యువ కౌలు రైతు మృతి



భట్టిప్రోలు(వేమూరు): కరెంట్ షాక్ వల్ల యువ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. భట్టిప్రోలు మండలంలోని గుత్తావారిపాలెం గ్రామానికి చెందిన వాకా శరత్(26) గురువారం ఉదయం పొలంలో నీరు పెట్టేందుకు కరెంట్ మోటారు వేశాడు. కొద్దిసేపు తర్వాత ఇనుప గొట్టంపై చెయ్యి పెట్టి మంచినీళ్లు తాగుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టడంతో పెద్దగా కేక వేసి కింద పడిపోయాడు. పక్క పొలంలో పని చేస్తున్న రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, వారు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేయగా మృతి చెందాడని తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

గురజాల: ఈ నెల 13వ తేదీన మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. చెక్ బౌన్స్, మోటారు వాహన ప్రమాదాలు, రెవెన్యూ వివాదాలు, బ్యాంకు సంబంధిత కేసులు వంటివి పరిష్కరించుకునే అవకాశం ఉన్నట్లు వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువులో మహిళ మృతదేహం లభ్యం


సామ్రాజ్యం (ఫైల్)

సత్తెనపల్లి: చెరువులో మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో గురువారం వెలుగుచూసింది. అబ్బూరు గ్రామానికి చెందిన రాచమంటి సామ్రాజ్యం (54) గత నెల 31వ తేదీన ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. మూడు ఏళ్లుగా ఆమె అనారోగ్యం కారణంగా మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో ఆమె భర్త చిన్న సైదులు, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. చివరకు గ్రామంలోని చెరువులో గురువారం మృతదేహం కనిపించింది. సామ్రాజ్యానికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు వివరాలు సేకరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

చీరాల అర్బన్: రామాపురంలోని ఓ రిసార్ట్‌లో పనిచేస్తున్న వ్యక్తి గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈపూరుపాలెం ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన అవ్వారు నరేష్ (42) రామాపురంలోని ఓ రిసార్ట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గురువారం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

యద్దనపూడిలో పట్టపగలే చోరీ

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన గల ఓ ఇంట్లో 70 సంవత్సరాలు వయస్సు గల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. గురువారం ఉదయం పొగాకు గ్రేడింగ్ పనులకు వెళ్లిన వృద్ధురాలు మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి రాగా ఇంటి తలుపులతో పాటు బీరువా తలుపులు సైతం తెరిచి ఉండటంతో గమనించి స్థానికులను అప్రమత్తం చేసింది. దీంతో బీరువాను పరిశీలించగా సుమారు 10 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. అలాగే బీరువా కింది బాగంలో వేరే అరలో ఉంచిన రూ.3 లక్షలకు పైగా నగదు అలాగే ఉండటంతో ఊపిరి పీల్చుకుంది. ఈ విషయమై ఎస్సై రత్నకుమారిని విలేకర్లు సంప్రదించగా చోరీ విషయం పరిశీలిస్తున్నామని.. ఇంత వరకు తమకు ఫిర్యాదు అందలేదన్నారు. చోరీ జరిగిన తీరును బట్టి వృద్ధురాలు బంధువులు గానీ సమీపంలోని వ్యక్తులు కానీ చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED

■ డైరెక్ట్ జాయినింగ్ మా కంపెనీలు కాలేజీల యందు సూపర్ వైజర్స్, స్టోర్ ఇన్చార్జ్, డ్రైవర్స్, EX-ఆర్మీ, కావలెను. (రూమ్+బోర్) PF, ESI, జీతం:18K to 32 K ✆ 83310 49979

■ గుంటూరు సిటీలోని ప్రముఖ హాస్పిటల్‌కి హౌస్‌కీపింగ్ స్త్రీలు జీతం 10 వేలు & వార్డు బాయ్స్ జీతం 12 వేలు అర్జెంటుగా కావలెను. 12 గం॥ డ్యూటీ. ✆ 85209 77729, 96423 13999

■ మంగళగిరి, తెనాలి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383

■ బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామం నందు ప్రముఖ ట్రాక్టర్స్ మరియు ఇంప్లిమెంట్స్ షోరూం నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్స్ కావలెను. Ph: 9985157771

■ నిరుద్యోగ యువతీ యువకులు ఉచితంగా Software Courses, Softskills & spoken English లలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం. Training కాలంలో అభ్యర్థులకు ఉచితంగా భోజనం & వసతి సౌకర్యాలు. ✆85200 55679

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలో పని చేయుటకు హాస్టల్ వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్చార్జ్‌లు కావలెను. 28-40సంవత్సరాలు మధ్య వయసు గల పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. దీనితోపాటు హాస్టల్ వసతి మరియు భోజనము సదుపాయం కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9248733372

■ MSME ప్రోగ్రాంలో పనిచేయుటకు బాపట్ల జిల్లా రేపల్లె నుండి ముగ్గురు (3) యువకులు కావలెను. సంప్ర: సెల్.9396225573

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంటను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 20K. Ph: 8977639662, 8977639663

■ జిల్లాలో బ్యాంకుల్లో వర్క్ చేయుటకు అటెండర్స్, క్లర్క్స్, రికవరీ, క్యాష్ లోడింగ్, కం.ఆపరేటర్స్, క్యాషియర్స్, అసిస్టెంట్స్. జీ: 27000/-, Q: 10-డిగ్రీ. 8297349403

■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ ఫెయిల్ to PG ఫోన్ : 7330711162

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వినాయక నిమజ్జనంలో ఉద్రిక్తత

- వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై దాడులు
- మాజీ ఎమ్మెల్యే బొల్లా కారు డ్రైవర్‌తో పాటు పలువురిపై విచక్షణారహితంగా దాడులు


కారుమంచిలో భారీగా మోహరించిన పోలీసులు

శావల్యాపురం: వినాయక నిమజ్జనం సందర్భంగా పల్నాడు జిల్లా కారుమంచి గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానుల వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. నిమజ్జనం సందర్భంగా 100 మందికిపైగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే గురువారం టీడీపీ అభిమానులు ఏర్పాటు చేసిన విగ్రహం నిమజ్జనం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలు గ్రామంలోని సత్రంబజారు ప్రధాన సెంటరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద రెండు గంటల పాటు రెచ్చగొట్టే విధంగా హంగామా చేయడంతోపాటు అటువైపుగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కారు డ్రైవర్ వేమూరి శ్రీకాంత్ పై దాడి చేశారు. అనంతరం, బండారుపల్లి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లపై దాడులు చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పరిస్థితిని అదుపుచేయలేక చేతులెత్తేశారు. గతేడాది కూడా ఇలాంటి ఘటనలు జరగటంతో పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

యూరియా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు


తంగెడ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

దాచేపల్లి: యూరియా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో యూరియా కొరత అధికంగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది వ్యాపారులు ఏపీ నుంచి యూరియా బస్తాలను తెలంగాణకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో యూరియా ఇలా తరలిపోకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం రాత్రి పొందుగల, తాంగేడ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. యూరియా తెలంగాణకు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. పూర్తిస్థాయిలో ఏపీలోనే రైతులు వినియోగించాలని కోరారు. అక్రమంగా తెలంగాణకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఏవో వెంకటేష్, ఆర్ఐ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు

జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు


ఎరువుల గోడౌన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నరసరావుపేట రూరల్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు చెప్పారు. నరసరావుపేటలోని పలు ఎరువుల దుకాణాలు, జీడీసీఎంఎస్ షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. జగ్గారావు మాట్లాడుతూ రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులు, యూరియాను కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని సూచించారు. అవసరం మేరకే కొనుగోలు చేయాలని తెలిపారు. రసాయనిక ఎరువులు కొన్న రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు. బిల్లులు ఇవ్వని ఎరువుల డీలర్లపై రసాయనిక ఎరువుల చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు అమ్మిన వెంటనే ఈ–పాస్ మిషన్ ద్వారా స్టాక్ అప్డేట్ చేయాలని డీలర్లను ఆదేశించారు. యూరియాను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కేవి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కే.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మత్స్యకారులు నిబంధనలను పాటించాలి


మాట్లాడుతున్న సంజీవ్‌రావు

సత్రశాల(రెంటచింతల): సత్రశాల వద్దనున్న కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు కచ్చితంగా నిబంధనలను పాటించాలని జిల్లా అధికారి ఎస్.సంజీవ్‌రావు అన్నారు. గురువారం సత్రశాలలో నాగార్జునసాగర్ (రైట్ బ్యాంక్) సత్రశాల మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ జలాశయానికి ప్రస్తుతం వరద ఉధృతంగా వచ్చి చేరుతుండటంతో చేపల వేటను తాత్కాలికంగా నిషేధించారు. మత్స్యకారులు సత్రశాల ప్రాంతంలో వేట కొనసాగించడంతో స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. ఇటీవల వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ఆయన అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ 30వ తేదీ నాటికి మత్స్యకారులకు ఇచ్చిన అనుమతుల గడువు పూర్తి అయిందని సంజీవ్‌రావు పేర్కొన్నారు. అనుమతి పొందిన ప్రాంతంలోనే ఎవరైనా చేపట వేటకు వెళ్లాలన్నారు. లేదంటే అనుమతులను రద్దుచేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కారంపూడి సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ దొప్పటపూడి మేరికనకం, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, మాచర్ల మత్స్యశాకాధికారి శ్రీనివాసరావు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా


కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మురుగునీరు

రేపల్లె: రేపల్లె పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్ వాసులు గురువారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ పైపుల ద్వారా తాగునీటి బదులు కలుషిత నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరఫరా అయిన నీటిలో నుంచి భరించలేని దుర్గంధం వెదజల్లుతుండటంతో తాగడానికి గానీ, వాడుకోవడానికి గానీ పనికి రాకపోయిందని కాలనీవాసులు వాపోయారు. రోజుకు ఒకసారి ఇచ్చే నీరు కూడా ఇలా కలుషితమై వస్తే తమ కుటుంబ అవసరాలు ఎలా తీర్చుకోవాలంటూ ప్రజలు ప్రశ్నించారు. కనీసం వాడుకోవడానికి ఒక బిందె కూడా శుభ్రమైన నీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ నేతాజీనగర్ సమీపంలోని వాడ మురుగు డ్రైన్‌లో బుధవారం పొక్లెయిన్‌తో పూడికతీత పనులు జరుగుతున్న సమయంలో పైపులు దెబ్బతిన్నాయని, అందువల్లే మురుగు నీరు సరఫరా లైన్లలోకి చేరిందన్నారు. సమస్యను గుర్తించి పైపు లీకేజీని సరిచేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి


వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదంలో బోల్తా పడిన కారు


వెంకటేశ్వరరెడ్డి మృతదేహం

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. కొరిశపాడు మండలం పరిధిలోని వెంటాపురం క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఈ ప్రమాదం జరిగింది. పి.గుడిపాడు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరెడ్డి (67) వెంకటాపురం వైపు నుంచి పి.గుడిపాడు వెళ్లేందుకు మోటారు బైకుపై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు.. బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వెంకటేశ్వరరెడ్డికి తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అదుపు తప్పిన కారు రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న నలుగురికి స్వల్పగాయాలు కాగా ప్రయివేటు వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.